సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 7 । డిసెంబర్ । 2023



పోటెత్తిన వేరుశనగ
వనపర్తి మార్కెట్‌యార్డుకు పెద్ద మొత్తంలో వేరుశనగ విక్రయానికి వచ్చింది.
వివరాలు 10లో ▸



కురుమూర్తిగిరులు కిటకిట
కురుమూర్తిస్వామి ఆలయానికి బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.4 /20.9
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు కురవచ్చు. ఉదయం,రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సైనిక పతాక దినోత్సవ నిధికి విరాళాలు ఇవ్వండి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సైనికుల సహాయార్థం ఏర్పాటు చేసిన సైనిక పతాక దినోత్సవ నిధికి విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ జి.రవినాయక్ ఒక ప్రకటనలో కోరారు. వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఈనెల 7న హుండీ డబ్బాలతో పతాకాలు అమ్ముతారని వారికి అందరూ సహకరించాలని తెలిపారు. దాతలు ఎవరైనా తమ విరాళం ఇవ్వాలనుకుంటే డిమాండ్ డ్రాఫ్ట్ లేదా చెక్కు రూపంలో 'డైరెక్టర్, సైనిక్ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్ - 500082' పేరిట చెల్లుబాటు అయ్యేలా మహబూబ్‌నగర్‌లోని ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలను సహించం



మహమ్మదాబాద్: వరిధాన్యం కొనుగోళ్లలో అవకతవకలను సహించేదిలేదని అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు తెలిపారు. చౌదర్‌పల్లిలో తూకం వేయకుండా వరిధాన్యం సేకరిస్తున్నారనే వచ్చిన కథనాలపై ఆయన స్పందించారు. బుధవారం వరిధాన్యం కొనుగోలు తీరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. తూకం వేసిన ధాన్యానికి ఎప్పటికప్పుడు ట్రాక్‌షీట్‌లను, వేయింగ్‌షీట్‌లను రైతులకు అందజేయాలని సూచించారు. తూకం మిషన్లను పని చేసే విధంగా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. చౌదర్‌పల్లిలో సిబ్బంది చేసిన తీరుపై మండిపడ్డారు. అనంతరం గాధిర్యాల్ కొనుగోలు కేంద్రాన్ని, రైస్‌మిల్లును పరిశీలించారు. ఆయన వెంట డీఎస్‌ఓ శ్రీనివాస్, డీఎం ప్రవీణ్‌కుమార్, డీటీలు నాగరాజు, ఆదిత్య, బాలప్రసాద్, డీపీఎం చెన్నయ్య, ఏపీఎం సునీత తదితరులు ఉన్నారు.

10న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 10న నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించే పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని, వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

పీయూలో బీఓఎస్‌ల నియామకం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ బోర్డు ఆఫ్ స్టడీస్‌లో రెండు డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి ఇద్దరు బీఓఎస్ అధికారులను నియమిస్తూ పీయూ రిజిస్ట్రార్ గిరిజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రసాయన శాస్త్రం బీఓఎస్ చైర్‌పర్సన్‌గా నూర్జహాన్, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ బీఓఎస్ చైర్‌పర్సన్‌గా చంద్రకిరణ్‌ను నియమించారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో బుధవారం రాత్రి అయోధ్యలోని శ్రీరామ మందిరం అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా స్థానిక శివశక్తినగర్‌కాలనీ ముఖద్వారం సమీపంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి విశ్వహిందూ పరిషత్ కార్యాలయం (వీహెచ్‌పీ) వరకు శోభాయాత్ర కొనసాగింది. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జి.చంద్రయ్య, సభ్యులు హనుమంతు, విగ్నేష్, రాచాల జనార్దన్, శ్రీధర్ బాబు, సి.హనుమంతు, హరిప్రసాద్, జి.సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్‌ఎన్‌ఆర్ క్వాంటా ధర రూ.3,181

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన ఈనామ్ టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.3,181, కనిష్టంగా రూ.2,456గా ధరలు నమోదయ్యాయి. హంస ధాన్యం ధర గరిష్టంగా రూ.2,073, కనిష్టంగా రూ.1,950గా ధరలు లభించాయి. ఆముదాల ధర గరిష్టంగా రూ.5,329గా ఒకే ధర వచ్చింది. మార్కెట్‌కు దాదాపు వేయి బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

'లోక్‌సభ'లో పైచేయి

2 పార్లమెంట్ నియోజకవర్గాల్లో హస్తానికే అధిక ఓట్లు

- మహబూబ్‌నగర్ ఎంపీ పరిధిలో 1,00,437 ఓట్ల ఆధిక్యం
- 'నాగర్‌కర్నూల్'లో 1,05,227 ఓట్ల మెజార్టీ
- అక్కడ, ఇక్కడా చతికిలపడ్డ బీజేపీ
- పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏఐఎఫ్‌బీ, బీఎస్పీ తర్వాతే 'కమలం'

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసిన కాంగ్రెస్.. పార్లమెంట్ సెగ్మెంట్లలో ఓట్ల పరంగా సత్తా చాటింది. పాలమూరులోని రెండు లోక్‌సభ స్థానాల పరిధిలోనూ అత్యధిక ఓట్లు కైవసం చేసుకుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 14 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా.. 12 స్థానాల్లో కాంగ్రెస్, రెండు చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు సంబంధించి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ పరిధిలో ఏడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ ఐదు, బీఆర్‌ఎస్ అభ్యర్థులు రెండు స్థానాల్లో గెలుపొందారు. సగటున మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో 7.62 శాతం, నాగర్‌కర్నూల్‌లో 7.52 శాతం ఓట్ల మెజార్టీతో బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ ఆధిక్యతను చాటుకుంది.



మహబూబ్‌నగర్ : కాంగ్రెస్ 46.36.. బీఆర్‌ఎస్ 38.74 శాతం

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల, మక్తల్, నారాయణపేట, కొడంగల్, షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ ఏడు సెగ్మెంట్లలో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. అన్ని స్థానాల్లోనూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధానంగా పోటీ సాగినప్పటికీ.. హస్తం అభ్యర్థులు భారీగా ఓట్ల ఆధిక్యతను సాధించారు. ఈ లోక్‌సభ పరిధిలో మొత్తం 13,19,086 ఓట్లు పోల్ కాగా.. కాంగ్రెస్‌కు 6,11,514, బీఆర్‌ఎస్‌కు 5,11,077, బీజేపీకి 1,13,080 ఓట్లు వచ్చాయి. కారు కంటే హస్తానికి 1,00,437 ఓట్ల ఆధిక్యం లభించింది. సగటున కాంగ్రెస్‌కు 46.36 శాతం ఓట్లు రాగా.. బీఆర్‌ఎస్‌కు 38.74 ఓట్లు మాత్రమే పోలయ్యాయి.

చతికిలపడ్డ బీజేపీ..

ఈ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీజేపీ చతికిలపడింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కల్వకుర్తి మినహా ఎక్కడా ప్రభావం చూపించలేకపోయింది. ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి తల్లోజు ఆచారి రెండో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో మక్తల్‌లో ఆ పార్టీ అభ్యర్థి జలంధర్‌రెడ్డి మెరుగైన పోటీ ఇచ్చారు. ఇవి మినహా ఏ ఒక్క స్థానంలోనూ కనీస పోటీ ఇవ్వలేకపోయారు. నాగర్‌కర్నూల్‌లో బీజేపీ మద్దతు ఇచ్చిన జనసేన అభ్యర్థి నాలుగో స్థానంలో నిలవగా.. మూడో స్థానంలో బీఎస్పీ నిలిచింది. గద్వాల, అలంపూర్, షాద్‌నగర్‌లో బీజేపీ నాలుగో స్థానానికి పరిమితమైంది.


నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో..

నియోజకవర్గం	పోలైన ఓట్లు	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
అచ్చంపేట	1,95,620	1,15,337	66,011	4,267
కల్వకుర్తి	2,02,752	75,858	42,847	70,448
కొల్లాపూర్	1,92,228	93,609	63,678	20,389
నాగర్‌కర్నూల్	1,84,616	87,161	81,913	1,955
వనపర్తి	2,13,164	1,07,115	81,795	9,185
గద్వాల	2,14,872	87,061	94,097	7,558
అలంపూర్	1,96,797	73,487	1,04,060	4,711

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో..

నియోజకవర్గం	పోలైన ఓట్లు	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
మహబూబ్‌నగర్	1,81,572	87,227	68,489	19,919
దేవరకద్ర	1,95,423	88,551	87,159	13,164
జడ్చర్ల	1,80,640	90,865	75,694	7,312
మక్తల్	1,87,834	74,917	57,392	45,455
నారాయణపేట	1,82,899	84,708	76,757	15,078
కొడంగల్	1,95,163	1,07,429	74,897	3,988
షాద్‌నగర్	1,95,555	77,817	70,689	8,164

పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఫలితాలు..



నాగర్‌కర్నూల్ : హస్తం 45.77.. కారు 38.20 శాతం

నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలో అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో గద్వాల, అలంపూర్‌లో బీఆర్‌ఎస్, మిగతా ఐదు సెగ్మెంట్లలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. కల్వకుర్తి మినహా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ సాగింది. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 14,00,049 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్‌కు 6,39,628, బీఆర్‌ఎస్‌కు 5,34,401, బీజేపీకి 1,18,513 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ 1,05,227 ఓట్ల ఆధిక్యతతో బీఆర్‌ఎస్‌పై పైచేయిగా నిలిచింది. సగటున హస్తానికి 45.69 శాతం ఓట్లు రాగా.. బీఆర్‌ఎస్‌కు 38.17 శాతం ఓట్లు మాత్రమే పోలైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

నేడు జిల్లా వాలీబాల్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 వాలీబాల్ బాలబాలికల టోర్నీతో పాటు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు టోర్నీ ప్రారంభమవుతుందని, జిల్లాలోని అన్ని మండలాల జట్లు స్కూల్ బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలని ఆయన కోరారు.

రేపు ఉమ్మడి జిల్లా రగ్బీ జట్టు ఎంపికలు

జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా అండర్-14 విభాగం బాలబాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రగ్బీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు రమేశ్‌బాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని, మిగతా వివరాల కోసం 9441565282 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



కోయిల్‌కొండ: ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన పోలింగ్ కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని అదనపు కలెక్టర్ యాదయ్య అన్నారు. కోయిలకొండలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు చేసిన పనితీరును ఆయన అభినందించారు. అదే ఉత్సాహంతో పంచాయతీ ఎన్నికల్లో పనిచేయాలని కోరారు. అలాగే పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, ఏపీవో నర్సయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

నోటా..వారి మాట!

- ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు భారీగా ఓట్లు
- పలుచోట్ల పోస్టల్ బ్యాలెట్లలో సైతం..
- 114 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ వచ్చిన వైనం

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైంది. ఐదేళ్లు తమను పాలించే పాలకులను ఎన్నుకునే వజ్రాయుధాన్ని వినియోగించుకోవాలని అందరూ అనుకుంటారు. ఓటు వేయాలని ఉన్నా.. పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ నచ్చకపోతే ఎలా అనే వారికి ఎన్నికల సంఘం నోటాను ప్రవేశపెట్టింది. ఈ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 20,926 మంది నోటా మీట నొక్కారు. పోటీలో ఉన్న స్వతంత్ర, ఇతర ప్రాంతీయ పార్టీలకు చెందిన 114 మంది అభ్యర్థులకు నోటా కన్నా తక్కువ ఓట్లు పోలయ్యాయి. అచ్చంపేట నియోజకవర్గంలో అత్యధికంగా 2,833 ఓట్లు నోటాకు రాగా.. అత్యల్పంగా 661 ఓట్లు కల్వకుర్తిలో నమోదయ్యాయి. అలంపూర్, కొడంగల్‌లో 2 వేలకు పైగా ఓట్లు నోటాకు వచ్చాయి. ఈ నేపథ్యంలో నోటాకు నమోదైనన ఓట్లపై కథనం...

– మహబూబ్‌నగర్ డెస్క్

నియోజకవర్గాల వారీగా నోటాకు వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	నో.వ.ఓ.	నో.కం.త.వ.అ.
అచ్చంపేట	2,833	11
అలంపూర్	2,013	9
దేవరకద్ర	1,706	8
జడ్చర్ల	1,655	11
కల్వకుర్తి	661	14
కొడంగల్	2,002	8
కొల్లాపూర్	1,037	9
మహబూబ్‌నగర్	1,157	10
మక్తల్	1,896	7
నాగర్‌కర్నూల్	1,122	9
నారాయణపేట	1,517	3
షాద్‌నగర్	1,389	9
వనపర్తి	1,938	6

నో.వ.ఓ.: నోటాకు వచ్చిన ఓట్లు
నో.కం.త.వ.అ.: నోటా కంటే తక్కువ వచ్చిన అభ్యర్థులు

➡ అచ్చంపేట నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థులు శాసనసభ ఎన్నికలలో పోటీ చేశారు. నోటాకు ఈవీఎంలలో 2,830 ఓట్లు పోలవ్వగా, పోస్టల్ బ్యాలెట్‌లో 3 ఓట్లు వచ్చాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ తప్ప మిగిలిన 11 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువగా ఓట్లు వచ్చాయి.

➡ అలంపూర్ నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా, నోటాకు 2,003 ఓట్లు ఈవీఎంలలో, 10 మంది పోస్టల్ బ్యాలెట్‌లో నోటాకు ఓటును వేశారు. ఇక్కడ సైతం బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు అత్యధికంగా ఓట్లు పోలవగా, బీజేపీ అభ్యర్థికి నోటా కంటే 2వేల ఓట్లు ఎక్కువ వచ్చాయి. మిగిలిన 9 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువే పోలయ్యాయి.

➡ దేవరకద్ర అసెంబ్లీకి 12 మంది అభ్యర్థులు పోటీ చేయగా.. నోటాకు 1,705 ఓట్లు ఈవీఎంలలో, ఒక పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ప్రధాన పార్టీ అభ్యర్థులు ముగ్గురికి తప్ప మిగిలిన వారికి ఓట్లు నోటాను దాటలేదు. బీఎస్పీ నుంచి పోటీ చేసిన అభ్యర్థికి 1,909 ఓట్లు వచ్చాయి.



➡ జడ్చర్ల నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు పోటీచేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులతో పాటు బీఎస్పీ అభ్యర్థికి నోటా కంటే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ నోటాకు 1,652 ఓట్లు ఈవీఎంలలో, 3 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయి.

➡ ఉమ్మడి జిల్లాలోనే కల్వకుర్తిలో అత్యధికంగా 24 మంది అభ్యర్థులు అసెంబ్లీకి పోటీ చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మినహా మిగతా 21 మంది డిపాజిట్ కోల్పోయారు. వీరిలో 14 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. ఇక్కడ నోటాకు ఈవీఎంలలో 660, ఒకటి పోస్టల్ బ్యాలెట్ ఓటు వచ్చింది.

➡ కొడంగల్ నియోజకవర్గంలో 13 అభ్యర్థులు పోటీలో ఉండగా.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మాత్రమే అత్యధిక ఓట్లు సాధించారు. బీజేపీతో సహా పోటీ చేసిన అభ్యర్థులలో 11 మంది డిపాజిట్లు కోల్పోయారు. ఇందులో ఎనిమిది మందికి 2 వేల ఓట్లు కూడా దాటలేదు. ఇక్కడ ఈవీఎంలో 1,999, పోస్టల్ బ్యాలెట్లలో మూడు ఓట్లు నోటాకు వచ్చాయి.

➡ కొల్లాపూర్ అసెంబ్లీకి 14 మంది అభ్యర్థులు చేయగా.. 11 మంది డిపాజిట్ కోల్పోయారు. తొమ్మిది మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 1,035 ఓట్లు ఈవీఎంలలో, 2 ఓట్లు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నోటాకు వచ్చాయి.

➡ మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు పోటీ చేయగా ప్రధాన పార్టీ అభ్యర్థులకు మాత్రమే డిపాజిట్లు దక్కాయి. పది మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ పోలయ్యాయి. ఇక్కడ 1,140 ఓట్లు ఈవీఎంలలో, 17 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నోటాకు వచ్చాయి.

➡ మక్తల్‌లో 11 మంది అభ్యర్థులు పోటీ ఉండగా... తొమ్మిది మంది డిపాజిట్ కోల్పోయారు. బీఎస్పీ నుంచి పోటీచేసిన అభ్యర్థికి నోటా కంటే 600 ఓట్లు ఎక్కువగా పోలయ్యాయి. ఇక్కడ నోటా కంటే ఏడుగురికి తక్కువ ఓట్లు పోలయ్యాయి. నోటాకు 1,895 ఓట్లు ఈవీఎంలలో పోలవగా, ఒక పోస్టల్ బ్యాలెట్ ఓటు వచ్చింది.

➡ నాగర్‌కర్నూల్ అసెంబ్లీకి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. 13 మంది డిపాజిట్ కోల్పోయారు. ఇందులో తొమ్మిది మందికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. ఈవీఎంలలో 1,116, పోస్టల్ బ్యాలెట్లు 6 ఓట్లు నోటాకు వచ్చాయి.

➡ నారాయణపేట నియోజకవర్గంలో ఏడుగురు పోటీలో ఉండగా.. ముగ్గురికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. ఇక్కడ ఈవీఎంలలో 1,512, పోస్టల్ బ్యాలెట్ల రూపంలో 5 ఓట్లు వచ్చాయి.

➡ షాద్‌నగర్ అసెంబ్లీకి 14 మంది అభ్యర్థులు పోటీచేశారు. పోటీచేపిన వారిలో ప్రధాన పార్టీలైన బీఎస్పీ, బీజేపీ పార్టీలకు డిపాజిట్ దక్కింది. ఇక్కడ 1,384 ఓట్లు ఈవీఎంలలో, 5 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నోటాకు పోలయ్యాయి. తొమ్మిది మంది అభ్యర్థులకు ఇక్కడ నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.

➡ వనపర్తి నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా.. ఆరుగురు అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. ఇక్కడ 1,928 ఓట్లు ఈవీఎంలలో, 10 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నోటాకు పోలయ్యాయి.

కార్యకర్తలు అధైర్యపడొద్దు



బీఆర్‌ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఎవరైనా కాంగ్రెస్ నాయకులు ఇబ్బంది పెడితే అండగా ఉండి కాపాడుకుంటానన్నారు. అధికార పార్టీ ఇచ్చిన హామీల అమలుకు కొంత సమయం ఇచ్చి అప్పటికీ అమలు చేయకుంటే ఒత్తిడి తీసుకొద్దామన్నారు. నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. శాసనసభ ఎన్నికల్లో అందరూ బాగా పనిచేశారని, పార్టీని పటిష్టానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు బి.రాజేశ్వర్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్‌చైర్మన్ తాటి గణేష్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు గోపాల్‌యాదవ్, శాంతయ్యయాదవ్, సమద్‌ఖాన్, కేఎస్ రవికుమార్ పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు సేవకుడిలా పనిచేస్తా

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎమ్మెల్యే అంటే ప్రజలకు జవాబు దారి అని, నియోజకవర్గ ప్రజలకు సేవకుడిలా పని చేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల జీవితాల్లో చీకటి రోజులు తొలగిపోయాయని, ఇక వెలుగు నింపే రోజులు వచ్చాయన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ ప్రజానీకం తన జీవితంలో మరిచిపోలేని మెజారీతో అఖండ విజయాన్ని అందించారని, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో బెదిరించే చర్యలకు పాల్పడినా, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించినా ఉక్కుపాదంతో అణచివేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇక నుంచి ప్రజల క్యాంప్ కార్యాలయమని, ప్రజలకు ఏ ఆపద ఎదురైనా నన్ను సంప్రదించాలని కోరారు. కొత్త ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలంతా ఒక కుటుంబంగా కలిసి మెలిసి జీవిద్దామన్నారు. నియోజకవర్గంలోని మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి అందరం కలిసి బాటలు వేద్దామని, ప్రతి ఒక్కరి సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు పోతామని తెలిపారు. సమావేశంలో నాయకులు వినోద్‌కుమార్, చంద్రకుమార్‌గౌడ్, సిరాజ్ ఖాద్రీ, బెక్కరి అనిత, లక్ష్మణ్‌యాదవ్, సాయిబాబా, నాగరాజు, బండ సునీల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వత్రా హర్షం..



ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి.. రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన రేవంత్‌రెడ్డికి జిల్లా ప్రజలతో ఉన్న సత్సంబంధాలను గుర్తు చేసుకుంటున్నారు. రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి పేరు సీఎం ఊరుగా మారిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. డైనమిక్ లీడర్ సీఎం అవుతున్నాడని, ఉమ్మడి పాలమూరు జిల్లాకు మంచి రోజులు వచ్చాయని మరికొందరు అభిప్రాయపడ్డారు. సొంత జిల్లాకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో పాటు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా పలువురు 'సాక్షి'తో తమ మనోగతాన్ని పంచుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

రాజకీయాల్లో చురుకైన వ్యక్తి..



రాజకీయ వ్యవహారంలో చాలా చురుకుగా పాల్గొనేవాడు. అతడు మొదట జెడ్పీటీసీగా గెలిచిన సందర్భంలో ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అగుడుపెడతానని, భవిష్యత్‌లో ముఖ్యమంత్రి అవుతానని చెబితే మేమంతా ఆశ్చర్యానికి గురయ్యేవారం. చివరకు రేవంత్‌రెడ్డి తన కలను సాకారం చేసుకోవడం సంతోషంగా ఉంది.

– తిరుపతిరెడ్డి, కల్వకుర్తి

యువతకు ఆదర్శం



రాజకీయాలలో రేవంత్‌రెడ్డి పట్టు సడలకుండా ఓపికతో ఒక్కో మెట్టు ఎక్కుతూ ముఖ్యమంత్రి స్థాయికి చేరారు. కల్వకుర్తి ప్రాంతానికి వన్నె తెచ్చిన రేవంత్‌రెడ్డిని యువత ఆదర్శంగా తీసుకొని రాజకీయాల్లో రాణించాలి.

– ప్రసాద్, కల్వకుర్తి

డైనమిక్ లీడర్ సీఎం అయ్యాడు..



కల్వకుర్తి ప్రాంతానికి చెందిన డైనమిక్ లీడర్ రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం గొప్ప విషయం. అతడిని చూసే నేను రాజకీయాలలోకి వచ్చాను. రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో మా ప్రాంత ఖ్యాతి మరింత పెరిగింది. నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్న రేవంత్‌రెడ్డికి మా ప్రాంతం తరఫున శుభాకాంక్షలు.

– సంతోష్, కల్వకుర్తి

ఎప్పటికైనా సీఎం కావాలని అనేవాడు..



రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సమయంలో మా భవనంలోనే వారి రాజకీయ పార్టీ కార్యాలయం (టీఆర్ఎస్) ఉండేది. అప్పట్లో అతను రాజకీయాల గురించి మాట్లాడుతూ.. తాను ఎప్పటికైనా సీఎం కావాలన్నది తన కల అని చెబుతూ ఉండేవాడు. చివరకు తన కల నెరవేరింది.

– భాస్కర్, వ్యాపారి, కల్వకుర్తి

సీఎం ఊరుగా మారిపోయింది..



రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిని ఇప్పుడు అందరూ సీఎం ఊరూ అని అంటున్నారు. ఇక్కడి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంతి కావడం చాలా ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు.

– వేమారెడ్డి, కొండారెడ్డిపల్లి

సంతోషంగా ఉంది..



రేవంత్‌రెడ్డి సీఎం కావడం సంతోషంగా ఉంది. బూర్గుల రామకృష్ణారావు సీఎంగా ఉన్నప్పుడు మాకు అంతగా గుర్తులేదు. కొన్నేళ్ల తర్వాత మన పాలమూరు బిడ్డకు అత్యున్నత పదవి రావడం సంతోషకరం. సీఎం హోదాలో పాలమూరును మరింత అభివృద్ధి పరుస్తారు.

– రత్నంనాయుడు, గద్వాల

పాలమూరుకు మంచి రోజులు..



పాలమూరు బిడ్డ సీఎం కావడంతో జిల్లాకు మంచి రోజులు వచ్చాయి. ఈ ప్రాంత బిడ్డగా రేవంత్‌రెడ్డి జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నాను.

– శ్రీరాములు, గద్వాల

ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి



రేవంత్‌రెడ్డి సొంత జిల్లా అయిన నాగర్‌కర్నూల్‌కు ప్రత్యేక నిధులను కేటాయించి రూపురేఖలు మార్చాలి. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారు వారి సొంత జిల్లాలను ఎలా అభివృద్ధి చేశారు. సాగునీటి ప్రాజెక్టులతో పాటు పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– శ్రీనాథ్‌గౌడ్, ఎండబెట్ల

సమస్యలు పరిష్కరించాలి..



ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. రాష్ట్ర సరిహద్దులోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో విద్య, వైద్యరంగాలు వెనుకబాటుకు గురయ్యాయి. ప్రజలకు అన్ని సదుపాయాలను సమకూర్చాలి.

– భీమేశ్వర్‌రెడ్డి, మానవపాడు

పరిశ్రమలు నెలకొల్పాలి..



గత ప్రభుత్వాలు పేదల సమస్యలను పూర్తిగా విస్మరించాయి. యువతకు ఉపాధి కల్పన, ఉద్యోగ అవకాశాలపై నిర్లక్ష్యం వహించాయి. యువత శ్రేయస్సు కోసం ప్రభుత్వం పనిచేయాలి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్నిరకాల పరిశ్రమలు నెలకొల్పాలి.

– అంజాద్ అలీ, రామన్‌పాడు, మదనాపురం మండలం

సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి..



జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం గర్వించాల్సిన విషయం. సొంత జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు నీరందేలా ప్రణాళికలను తయారు చేసుకోవాలి. ఇప్పుడు కొనసాగుతున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు త్వరగా పూర్తి చేయాలి.

– వెంకట్‌రెడ్డి, పొల్కూరు, తాడూరు మండలం

జిల్లాకు మేలు చేకూర్చాలి..



ఉమ్మడి పాలమూరు జిల్లావాసి ముఖ్యమంత్రి కావడం గర్వంగా ఉంది. సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న రేవంత్‌రెడ్డికి అభిమానులు అధికంగా ఉన్నారు. జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– ప్రభాకర్, ఉండవెల్లి

జిల్లాకే గర్వకారణం..



నల్లమల ప్రాంతానికి చెందిన వ్యక్తి సీఎం కావడం ఎంతో గర్వకారణం. సామాన్య కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదిగి సీఎం కావడం గొప్ప విషయం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగుతాయనే నమ్మకం ఉంది. ప్రస్తుత మేనిఫెస్టోలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం సంతోషకరం.

– శారదమ్మ, అచ్చంపేట

కొడంగల్ మరింత అభివృద్ధి..



వెనుకబడిన కొడంగల్ ప్రాంతం నుంచి గెలుపొందిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ఇక్కడి ప్రజల అదృష్టం. మా ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుంది. రేవంత్‌రెడ్డి సీఎం కావడం మా ప్రాంత ప్రజలతో పాటు మాలాంటి కాంగ్రెస్ నాయకులకు ఎంతో గర్వంగా ఉంది.

– వార్ల విజయ్‌కుమార్, టీపీసీసీ సభ్యుడు, కోస్గి

నిరుద్యోగులకు అండగా నిలవాలి..



రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో అచ్చంపేట ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఆ విశ్వాసం, నమ్మకంతోనే కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపించారు. నిరుద్యోగులకు అండగా నిలవాలి. ఈ ప్రాంతంలో పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– పులిజాల రవికుమార్‌గౌడ్, గోదల్, బల్మూర్ మండలం

దేశంలోనే ప్రత్యేక గుర్తింపు



ఎమ్మెల్యేగా పని చేసినప్పుడే కొడంగల్‌కు గుర్తింపు తెచ్చిన నాయకుడు రేవంత్‌రెడ్డి. ఇప్పుడు ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కావడంతో కొడంగల్ ప్రాంతంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు రావడం ఖాయం. కొడంగల్ ఎమ్మెల్యే రాష్ట్రాన్ని పాలించడం హర్షించదగ్గ విషయం.

– ఇద్రీస్, కౌన్సిలర్, కోస్గి

ప్రగతిలో ముందుంటుంది..



రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గం కావడంతో రాష్ట్రంలోనే కొడంగల్ అభివృద్ధిలో ముందుంటుంది. రేవంత్‌రెడ్డి హయాంలో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోవడం ఖాయం. రేవంత్‌రెడ్డి సీఎం కావడం సంతోషంగా ఉంది.

– నాగులపల్లి చంద్రకళ, కౌన్సిలర్, కోస్గి

ఇంకెన్నాళ్లీ అవస్థలు..



కంకరవేసి వదిలేసిన అన్నారెడ్డిపల్లి రహదారి

ఏళ్లు గడుస్తున్నా రోడ్డు సౌకర్యం లేని తండాలెన్నో..

- కంకర తేలిన రహదారులు.. శిలాఫలకాలకే పరిమితమైన నిర్మాణాలు
- అన్నారెడ్డిపల్లి, బాపనికుంటతండాలకు అసంపూర్తి రోడ్లు

మహమ్మదాబాద్: స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నా గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాలు నేటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. పదేళ్ల అధికారంలో ఉన్న ప్రభుత్వం తండాలకు తారురోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చినా.. ఆ ప్రకటనలు శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. సరైన రోడ్లు లేక ప్రయాణికులు, వాహన చోదకులు, గిరిజనతండా వాసులు నిత్యం రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి గండేడ్ మండలంలోని అన్నారెడ్డిపల్లి, సంగాయపల్లి, షేక్‌పల్లితండా, జిన్నారంతండా, మంగంపేటతండా, బాపనికుంటతండా, పెద్దతండా, కుచ్చెమీదితండా, బొమ్మికుంట తదితర గిరిజన తండాలకు రహదారి సౌకర్యం లేదు.

అన్నారెడ్డిపల్లితండాకు..

మండలంలోని అన్నారెడ్డిపల్లితండా రహదారి నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.1.23 కోట్లు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. కాని కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. అలాగే మంగంపేట, బాపనికుంట, పెద్దతండా రహదారులు గుంతలమయంగా మారాయి. రహదారి నిర్మాణాలు చేపట్టాలని పలుమార్లు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆయా తండాల ప్రజలు వాపోతున్నారు.

శిలాఫలకాలకే పరిమితం..



మంగంపేటతండా రహదారి నిర్మాణానికి వేసిన శిలాఫలకం

గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లోని పలు గ్రామాలు, గిరిజన తండాల రహదారుల నిర్మాణాలకు ప్రజాప్రతినిధులు ఆగమేఘాల మీద శిలాఫలకాలు వేశారు.. కాని పనులు ప్రారంభించడంలో కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేశారు. దీంతో ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. గండేడ్ మండలం జిన్నారం తండా, మంగంపేట, తండా, షేక్‌పల్లి తండాలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి శిలాఫలకాలు వేసి వదిలేశారు.

కంకర తేలిన రోడ్లు..



మా తండా మీదుగా నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల కిందట కంకరవేసి వదిలేశారు. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించలేక ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మాత్రం కనిపించకుండాపోయారు. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ మాత్రం స్పందించడం లేదు.

– మోహన్, అన్నారెడ్డిపల్లి

గిరిజన తండాలపై చిన్నచూపు..



రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చేందుకు గిరిజన తండాలను అభివృద్ధి చేస్తామని హామీలు ఇవ్వడమే తప్పా గెలిచిన తర్వాత చేసేదేమీ లేదు. ఉమ్మడి మండలంలోని పలు గిరిజన తండాలకు రహదారి సౌకర్యం లేదు. నిధులు మంజూరైనా పనులు చేయకుండా వదిలేస్తున్నారు. జిన్నారంతండా, అన్నారెడ్డిపల్లి, మంగంపేట, షేక్‌పల్లి, బాపనికుంటతండాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– సునీల్, మంగంపేటతండా

బిల్లులు రాక పనులు నిలిచాయి..

మండలంలోని అన్నారెడ్డిపల్లి, బాపనికుంట తండా రహదారి నిర్మాణాలకు కాంట్రాక్టర్లు టెండర్లు వేసి పనులు దక్కించుకొని ప్రారంభించారు. బిల్లులు సకాలంలో మంజూరుకాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి. మరిన్ని పనులకు టెండర్లు వేసినా కాంట్రాక్టర్లు భయపడి పనులు చేయడం లేదు. ఉన్నతాధికారులకు విన్నవించి పెండింగ్ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– మతీన్, ఏఈ, పంచాయతీరాజ్

రైలు కింద పడి వ్యక్తి మృతి

గద్వాల్ క్రైం: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం, నాపాడు జిల్లా, బాబుపలికి చెందిన గౌరి శంకర్(40) మంగళవారం ఉదయం 7 గంటలకు యశ్వంత్‌పూర్ నుంచి కోర్బా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైల్‌లో భార్య లంబేసాగర్, 6 ఏళ్ల కుమారుడితో బెంగుళూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గద్వాల్ రైల్వేస్టేషన్ దాటిన అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో పూడూరు రైల్వేస్టేషన్ సమీపంలో వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు గౌరిశంకర్ జారి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు.

తాగిన మైకంలో కిందపడి..

జడ్చర్ల టౌన్: పట్టణానికి చెందిన విష్ణు (26) బుధవారం వీరశివాజీనగర్‌లోని మద్యం దుకాణం సమీపంలో ఉన్న డ్రెయినేజీ పక్కన పడి మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మద్యానికి బానిసయ్యాడు. తాగిన మైకంలో పడిపోగా.. బుధవారం ఉదయం స్థానికులు గుర్తించి బంధువులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి చూడగా అప్పటికే చనిపోయాడు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్తూ మరొకరు..

జడ్చర్ల టౌన్: సమీప బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైల్వే ప్లాట్‌ఫారంపై పడి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులు (52) మహబూబ్‌నగర్‌లో సమీప బంధువు చనిపోవడంతో బుధవారం అంత్యక్రియలకు హాజరయ్యేందుకు రైలులో బయలుదేరాడు. జడ్చర్లలో ఉన్న కుమార్తెను తీసుకెళ్లేందుకు స్టేషన్‌లో రైలు ఆగకముందే దిగేందుకు ప్రయత్నించి ప్లాట్‌ఫారంపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ఆస్పత్రికి తరలించారు.

ఇంటి తాళం పగలగొట్టి బంగారం, నగదు అపహరణ

చారకొండ: మండల కేంద్రంలో ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి బంగారం, వెండి, నగదు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొప్పుల బాల్‌నారయ్య ఈనెల 4న తమ కుటుంబసభ్యులతో కలిసి శ్రీశైలం వెళ్లారు. తిరిగి 5వ తేదీన ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో దాచిన రెండు చైన్‌లు, పూసలదండా, రింగులు, బంగారు నగలు నాలుగు తులాలు, వెండి ఆభరణాలు, రూ.98 వేల నగదు చోరీకి గురయ్యాయి. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు మృతి



వేణుగోపాల్ (ఫైల్)

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బాదేపల్లికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కె.వేణుగోపాల్ (75) బుధవారం మృతి చెందారు. నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా దివంగత అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. అదేవిధంగా 30ఏళ్ల పాటు ఎస్‌టీయూ సంఘం బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. మున్సిపాలిటీలోని నేతాజీ చౌరస్తాలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం ప్రతిష్ఠించడంలోనూ ఆయన కీలకపాత్ర పోషించారు. బాదేపల్లి శాఖ గ్రంథాలయం అభివృద్ధికి కృషి చేశారు. జడ్చర్లలో జరిగిన అనేక కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా వ్యవహరించారు. విద్యార్థులను సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించే వారు. ఆయన మృతిపై పలు ఉపాధ్యాయ సంఘాలు సంతాపం వ్యక్తం చేశాయి. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం బాదేపల్లిలో నిర్వహించనున్నారు.

పాఠశాలలో ఉపాధ్యాయుడి హఠాన్మరణం

ధన్వాడ: నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలోని గోటూర్ ఉన్నత పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు.. మరికల్ మండలం పెద్దచింతకుంట గ్రామానికి చెందిన రమేష్‌గౌడ్ (50) గోటూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే పాఠశాలకు హాజరైన ఆయన.. ఛాతిలో నొప్పి వస్తుందని విద్యార్థులతో ఈనో ప్యాకెట్ తెప్పించుకుని తాగారు. అయినప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో విశ్రాంతి తీసుకునేందుకు పాఠశాల పైభాగంలో ఉన్న గదిలోకి వెళ్లిన కొద్ది సేపటికే గుండెపోటుకు గురయ్యారు. గమనించిన తోటి ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించగా.. అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు.

భర్త చేతిలో భార్య హతం

- ప్రియుడితో సన్నిహితంగా ఉండడం చూసి ఆగ్రహం
- కత్తితో భార్యను పొడిచి.. ఆమె ప్రియుడి గొంతుకోసిన వైనం
- ఆస్పత్రికి తరలించేలోపే భార్య మృతి, ప్రియుడి పరిస్థితి విషమం
- గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు
- సమాచారం అందుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జడ్చర్ల టౌన్: కట్టుకున్న భార్య మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండటం చూసి తట్టుకోలేకపోయిన భర్త కత్తితో పొడిచి ఆమెను హతమార్చడంతో పాటు.. ఆమె ప్రియుడి గొంతు కోశాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. భూత్పూర్ మండలం భట్టుపల్లికి చెందిన శేఖర్‌గౌడ్‌కు అదే మండలం మొల్గరకు చెందిన అనూషతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు మగ సంతానం ఉన్నారు. బతుకు దెరువు నిమిత్తం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతి కాలనీలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కాలనీ సమీపంలో అనూష లేడీస్ టైలర్ నిర్వహిస్తోంది. శేఖర్ జడ్చర్లలో కారు మెకానిక్‌గా పనిచేస్తున్నారు. శేఖర్‌కు సోదరుడి వరుస అయ్యే భట్టుపల్లికి చెందిన ప్రదీప్‌గౌడ్ భూత్పూర్‌లో జిమ్ ట్రైనర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో వరసకు మరిది అయ్యే ప్రదీప్‌గౌడ్‌తో అనూషకు సన్నిహితం ఏర్పడి వివాహేతర సంబంధం కొనసాగింది. కాగా.. టైలర్ షాపునకు పక్కన కూతురితో ఉంటున్న ఒంటరి మహిళతో అనూష స్నేహం చేసింది. తరుచూ ఆ మహిళ ఇంట్లోని వాష్‌రూం (మరుగుదొడ్డి)ని వినియోగించుకుంటుంది. ఇదే క్రమంలో బుధవారం సదరు ఒంటరి మహిళ ఓ పని నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా.. అనూష తన ప్రియుడు ప్రదీప్‌గౌడ్‌కు ఫోన్ చేసి అక్కడికి పిలుపించుకుంది. ఒంటరి మహిళ కుమార్తెను టైలర్ షాపులో కూర్చొబెట్టి.. ప్రియుడితో కలిసి వారి ఇంట్లోకి వెళ్లింది. అదే సమయంలో టైలరింగ్ దుకాణం వద్దకు చేరుకున్న శేఖర్‌గౌడ్ అక్కడ తన భార్య కనిపించకపోవడంతో అక్కడే ఉన్న బాలికను ప్రశ్నించాడు. తమ ఇంట్లో ఉన్న వాష్‌రూంకు వెళ్లిందని బాలిక చెప్పడంతో భర్త అక్కడికి వెళ్లాడు. ఈ సమయంలో అనూష, ప్రదీప్‌గౌడ్ సన్నిహితంగా ఉండడం చూసి తట్టుకోలేక ఆగ్రహంతో అదే గదిలో ఉన్న కత్తితో దాడి చేశాడు. భార్యను కత్తిపోట్లు పొడవగా.. ప్రదీప్‌గౌడ్ గొంతు కోశాడు. ఆ సమయంలో అలజడి వినిపించి ఇంటి యజమానురాలు అక్కడికి వచ్చి.. ఇలా చేశావేంటని శేఖర్‌ను నిలదీసింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో భార్య, ప్రదీప్‌ను ఆయన మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే అనూష మృతి చెందిందని డాక్టర్లు వెల్లడించారు. ప్రదీప్‌ను ఆస్పత్రిలో చేర్పించి.. భార్య మృతదేహాన్ని మొల్గరకు తీసుకెళ్లి జరిగిన విషయం మొత్తం కుటుంబసభ్యులకు చెప్పారు. దీంతో వారు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే భూత్పూర్ పోలీసులు గ్రామానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నాడు. అనూష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ప్రదీప్‌గౌడ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. జడ్చర్ల సీఐ రమేష్‌బాబు ఘటన జరిగిన ఇంటిని పరిశీలించి.. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో రాష్ట్ర పరిశీలకుడు కృష్ణమోహన్



స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎంను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

జడ్చర్ల టౌన్: ప్రతి రికార్డును సక్రమంగా నిర్వహించాలని స్కూల్ కాంప్లెక్స్ సమావేశ రాష్ట్ర పరిశీలకుడు కృష్ణమోహన్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం బాదేపల్లి బాలికల జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన తెలుగు స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. పాఠ్యాంశాల బోధనలో తీసుకోవాల్సిన మెళకువలను వివరించారు. ఎవరైనా రాష్ట్ర పరిశీలకులు పాఠశాలలు సందర్శించే అవకాశం ఉన్నందున అందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏఏ రికార్డులు నిర్వహించాలో వారికి అవగాహన కల్పించారు. బోధనను సైతం పరిశీలకులు పరిశీలించే ఆస్కారం ఉన్నందున పాఠ్యాంశాల బోధన ఎలా చేయాలో చేసి చూయించారు. సమావేశంలో భాగంగా నసురుల్లాబాద్ ఉపాధ్యాయుడు తిమోతి మాదిరి పాఠ్యాంశం బోధన చేశారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మి మాట్లాడుతూ 6 నుంచి 9వ తరగతి వరకు పాఠ్యాంశాల బోధన, విద్యార్థులకు మంచి ఫలితాలు రాబట్టే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై వివరించారు. ముఖ్యంగా ఉన్నతి కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయులు చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు నాలుగు జట్లుగా ఏర్పడి రాబోయే తరగతుల్లో పాఠ్యాంశాల బోధన ఎలా ఉండాలనే ప్రణాళికలు రూపొందించారు. కార్యక్రమంలో భాగంగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంను ఇతర ఉపాధ్యాయులు సత్కరించారు.

రైతువేదిక తాళాలు పగులగొట్టిన దుండగులు

మహమ్మదాబాద్: మండల పరిధిలోని నంచర్ల రైతువేదిక తాళాలు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి పగులగొట్టిన ఘటన చోటుచేసుకుంది. కాగా ఎప్పటి మాదిరిగా బుధవారం ఉదయం సంబంధిత అధికారులు, ఏఈఓ ప్రసన్న వచ్చి చూడగా రైతువేదిక, వారు ఉండే కార్యాలయం గది తాళాలు పగులగొట్టి డోర్లు తెరుచుకుని ఉండడం గమనించారు. గది తాళం నుజ్జునుజ్జు అయ్యి డోర్లు రాకపోవడంతో చేసేదేమిలేక దుండగులు వెనుదిరిగి వెళ్లిపోయి ఉంటారని వారు వివరించారు. కార్యాలయంలో రైతుబంధు, రైతుబీమా తదితర ఫైళ్లు ఉన్నాయని తాళం రాకపోవడంతో ఏమీ తీసుకెళ్లలేదని తెలిపారు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఏఈఓ వివరించారు.

సాయం.. శరవేగం

ఏపీ సీఎం ఆదేశాలతో సహాయక చర్యలు ముమ్మరం



సాక్షి, అమరావతి / సాక్షి నెట్‌వర్క్: తుపాను ప్రభావానికి గురైన జిల్లాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం వేగంగా సహాయక చర్యలు చేపట్టింది. తుపాను ప్రారంభం కాక ముందు నుంచే కట్టుదిట్టంగా ముందస్తు ఏర్పాట్లు చేయడం వల్ల ప్రాణ నష్టాన్ని నివారించగలిగారు. ఎనిమిది జిల్లాల్లో 320 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి.. 20,572 మందిని తరలించారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 124 శిబిరాల్లో 6,077 మందికి ఆశ్రయం కల్పించారు. తిరుపతి జిల్లాలో 36 కేంద్రాల్లో 3,386 మందికి, పశ్చిమగోదావరి జిల్లాలో 12 కేంద్రాల్లో 5,113, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 37 కేంద్రాల్లో 910, బాపట్ల జిల్లాలో 74 కేంద్రాల్లో 3,888, గుంటూరులో 14 శిబిరాల్లో 1,111, కోనసీమ జిల్లాలో 36 శిబిరాల్లో 910, పశ్చిమ గోదావరిలో 32 శిబిరాల్లో 5,113, తూర్పు గోదావరిలో 3 కేంద్రాల్లో 87 మందికి పునరావాసం కల్పించారు. బాధితులందరికీ భోజనం, మంచి నీటి సౌకర్యం కల్పించారు. వారికి అక్కడే నిత్యావసరాలు అందిస్తున్నారు. బాధిత కుటుంబాలు ఇళ్లకు వెళ్లే ముందు ఆర్థిక సాయంగా రూ.1000 నుంచి రూ.2500 అందిస్తున్నారు. తుఫాను ప్రభావిత గ్రామాల్లో 6 ఎస్డీఆర్ఎఫ్, 6 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. కృష్ణా జిల్లా అవనిగడ్డ, మచిలీపట్నం, ప్రకాశం జిల్లా ఒంగోలు, నెల్లూరు, ఉలవపాడు, బాపట్ల, నాయుడుపేటలో ఈ బృందాలు సేవలు అందిస్తున్నాయి. అధికార యంత్రాంగం దెబ్బతిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించడంతో రాకపోకలు యథాతథంగా కొనసాగుతున్నాయి. వర్షం తెరిపి ఇవ్వడంతో రైతులు ముంపునకు గురైన పంటలను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. వ్యవసాయ శాఖ అధికారులతో పాటు ఆర్బీకే సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మరోవైపు రైతుల నుండి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ప్రభుత్వం తీసుకున్న సత్వర చర్యలతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఆపదలో ఉన్న రైతులను గుర్తించడమే కాకుండా, వారి వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వెంటనే కొనుగోలు చేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారు. సీఎం ఆదేశాల మేరకు తేమ శాతంతో సంబంధం లేకుండా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి.

టీడీపీకి లక్ష్యంగా అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి

ఆయనపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర రీతిలో తప్పుడు ప్రచారం

- ఐటీడీపీ నేతృత్వంలో ఆయన పేరుతో నకిలీ ఖాతాలు
- ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలను పొన్నవోలు దూషించినట్లు పోస్టులు
- ఆయనే వాటిని పోస్టు చేసినట్లు చిత్రీకరణ
- చంద్రబాబు స్కాంలపై రాష్ట్ర ప్రభుత్వం తరపున కోర్టుల్లో వాదిస్తున్న సుధాకర్‌రెడ్డి
- దీంతో సుధాకర్‌రెడ్డిపై టీడీపీ వర్గాల దుష్ప్రచారం



సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయస్థానాల్లో వాదనలు వినిపిస్తున్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ లక్ష్యంగా చేసుకుంది. ఆయనపై అనైతిక దాడులకు పాల్పడుతోంది. టీడీపీ పెద్దల ప్రోద్బలంతో సోషల్ మీడియాలో ఆ పార్టీ అనుబంధ సంఘం ఐటీడీపీ అసభ్యకర రీతిలో పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం ప్రారంభించింది. ఆయన పేరుతో సామాజిక మాధ్య మాల్లో నకిలీ ఖాతాలు తెరిచి అందులో అసభ్య పదజాలం ఉపయోగిస్తూ పోస్ట్ చేస్తోంది. ఆయనే వాటిని పోస్ట్ చేసినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తోంది. ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, తెలంగాణ సీఎల్పీ నేత రేవంత్‌రెడ్డికి, పలువురు ఎంపీలకు వ్యతిరేకంగా పొన్నవోలు ట్వీట్లు చేసినట్లుగా సామాజిక మాధ్య మాల్లో ప్రచారం చేస్తోంది. ఇందుకోసం సుధాకర్‌రెడ్డి పేరుతో ఆయన ఫొటోను ఉపయోగించి నకిలీ ఖాతాలను తెరిచింది. న్యాయవ్యవస్థపై సుధాకర్‌రెడ్డి ఆరోపణలు చేసినట్లు నకిలీ వార్తలను వ్యాప్తి చేస్తోంది. న్యాయస్థానాల్లో పొన్నవోలును ఢీకొట్టలేని టీడీపీ ఇలా తప్పుడు మార్గాలను అనుసరిస్తోంది. తద్వారా సుధాకర్‌రెడ్డి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోంది.

సీఎంగా ఉండగా చంద్రబాబు చేసిన అనేక కుంభకోణాలపై సీఐడీ కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఏసీబీ కోర్టు మొదలు సుప్రీం కోర్టు వరకు గట్టిగా, సమర్థంగా వాదనలు వినిపిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆయన వాదనాపటిమతో చంద్రబాబు జైలుకెళ్లక తప్పలేదు. చంద్రబాబుకు ఏసీబీ కోర్టు 14 రోజులు పాటు రిమాండ్ విధించడం, మధ్యంతర బెయిల్ వచ్చే వరకు ఆయన జైలులోనే ఉండటంలో పొన్నవోలు కీలక పాత్ర పోషించారు. చంద్రబాబు మధ్యంతర బెయిల్, రెగ్యులర్ బెయిల్‌ను కూడా సుధాకర్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. హైకోర్టులో గట్టిగా వాదనలు వినిపించారు. హైకోర్టు చంద్రబాబుకు బెయిల్ ఇచ్చిన వెంటనే హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాలు చేయించారు. దగ్గరుండి పిటిషన్ దాఖలు చేయించి అతి తక్కువ సమయంలోనే అది విచారణకు వచ్చేలా చేయడంలో విజయం సాధించారు. ఇలా ప్రతి దశలో సుధాకర్‌రెడ్డి అడ్డు తగులుతుండటంతో టీడీపీ వర్గాలు ఆయన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. ఆ పార్టీ సీనియర్ నేతలు గత వారంలో ప్రతి రోజూ సుధాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా మీడియా సమావేశాలు పెట్టి మరీ దూషించడం మొదలుపెట్టారు. ఆయనపై సీఎస్‌కు సైతం ఫిర్యాదు చేశారు. హైకోర్టులో సైతం ఆయనపై పిల్ దాఖలు చేయించారు. అయితే, ఇవన్నీ అంతగా ఫలించలేదు. దీంతో టీడీపీ వర్గాలు మరింత బరి తెగించాయి. ఆయన పేరుతో ప్రముఖ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలు తెరిచి, వాటి ద్వారా అసభ్య పదజాలంతో ట్వీట్లు చేస్తూ వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. సుధాకర్‌రెడ్డే ఆ ట్వీట్లు చేస్తున్నట్లు కూడా ప్రచారం మొదలుపెట్టాయి. ఈ విషయం సుధాకర్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. టీడీపీ తప్పుడు ప్రచారంపై పొన్నవోలు బుధవారం సీఐడీకి ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమైన 'ఎక్స్'కు సైతం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆ ట్వీట్లను తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి వాటికి భయపడేది లేదని, ఇలా వెనుక నుంచి కాకుండా తనతో నేరుగా పోట్లాడాలని ఆయన టీడీపీ నాయకులకు సవాలు విసిరారు. కుంభకోణాల్లో చంద్రబాబుకు శిక్ష పడే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తెలిపారు.

తుపాను మృతులకు ప్రధాని మోదీ సంతాపం

విపత్తులో విశేష సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసలు



సాక్షి, న్యూఢిల్లీ: 'మిచాంగ్' తుపాను ప్రభావంతో మృతి చెందిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. తుపాను ప్రభావిత రాష్ట్రాల్లో పెనుగాలుల బీభత్సం, వర్ష సంబంధిత ఘటనల్లో పలువురు మృతి చెందడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటున్న అధికారుల సేవలను ప్రధాని కొనియాడారు. పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు వీరంతా సేవలందిస్తారని బుధవారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

ఉత్తర తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌పై కొనసాగుతున్న వాయుగుండం



సాక్షి, హైదరాబాద్: ఉత్తర తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా వాయుగుండం కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది క్రమంగా బలహీనపడి అల్పపీడనంగా మారుతుందని, దీని ప్రభావంతో గురువారం రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మాదిరి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వివరించింది. శుక్రవారం రాష్ట్రంలో పొడివాతావరణమే ఉంటుందని తెలిపింది. కాగా, బుధవారం రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రత మహబూబ్‌నగర్‌లో 30 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 17.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

గూడ్స్ రైలుకు తప్పిన ప్రమాదం

పెనుబల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్తలంకపల్లి సమీపాన గూడ్స్ రైలుకు ప్రమాదం తప్పింది. భారీ వర్షాల కారణంగా ఇక్కడ రైల్వే ట్రాక్‌పై కొండచరియలు పడ్డాయి. అదే సమయానికి గూడ్స్ వస్తుండగా, గుర్తించిన సిబ్బంది రాకపోకలను నిలిపివేశారు. యుద్ధ ప్రాతిపదికన ట్రాక్‌పై రాళ్లను తొలగించి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కాగా, సత్తుపల్లి మండలంలోని ఓసీల నుంచి నిత్యం కొత్తగూడెంకు వేల టన్నుల బొగ్గు గూడ్స్ రైళ్ల ద్వారా రవాణా జరుగుతుంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగానే కొండచరియలు ట్రాక్‌పై పడి ఉంటాయని భావిస్తున్నారు.

పంట.. నీటిపాలు



బూర్గంపాడులో వర్షాలకు దెబ్బతిన్న పత్తి చేను



కూసుమంచి మండలం నేలపట్లలో తడిసిన మిర్చిని ఆరబోస్తున్న రైతులు

▶ మొదటి పేజీ తరువాయి

నేలవాలుతోంది. గాలులకు ఆరిపోయి ఉన్న కంకుల నుంచి గింజలు నేలరాలిపోతున్నాయి. ఇక నేలవాలిన కంకులు తేమ కారణంగా మొలకొచ్చే ప్రమాదం కూడా ఉంది. ఇక నేలవాలిన వరిని యంత్రాలు కోయటం అంతగా సాధ్యం కాదు. కూలీలతో వరికోతలు జరిపించాల్సి ఉంటుంది. దీంతో రైతులకు ఖర్చులు మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఓ వైపు పంట నేలవాలి కొంత దెబ్బ తినగా, మరో వైపు కూలీల ఖర్చులు పెరిగి పెట్టుబడులు మరింతగా పెరిగే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక కల్లాల్లో ఆరబెట్టిన రైతులు రాశులుగా చేసి టార్పాలిన్లను కప్పి రక్షించుకునే పనిలో ఉన్నారు. తేమతో ఉన్న ధాన్యం రాశులు నాణ్యత కోల్పోతాయని రైతులు దిగులు చెందుతున్నారు. రెండు రోజులు తుపాను కొనసాగితే రాశుల్లో మొలకొచ్చే ప్రమాదం కూడా ఉందని రైతులు చెబుతున్నారు.

మిర్చిది అదే పరిస్థితి...

కాత దశలో ఉన్న మిర్చి పైర్లు నేలవాలే ప్రమాదం ఉంది. మిర్చి కాయబరువుతో చెట్టు పడిపోతుందని రైతులు చెబుతున్నారు. అక్కడక్కడ తొలి కోతలు కూడా సాగుతున్నాయి. కోసిన మిర్చి ఆరబెట్టకుండా రాశులుగా కల్లాల్లో ఉంచితే తేమబారిన పడి నాణ్యత కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. తేమతో ఉన్న కాయకు నల్లమచ్చ ఆశించే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వానలు మాత్రం రైతులను నష్టపరుస్తున్నాయే తప్పా ప్రయోజనం కలిగించటం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీగానే నష్టం

ఖమ్మం జిల్లాలో 53,903 మంది రైతులకు చెందిన 82,191 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. ఇందులో అధికంగా వరి 59,307 ఎకరాల్లో నష్టపోయినట్టు చెబుతున్నారు.

- భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 7,450మంది రైతులకు సంబంధించిన 13,608 ఎకరాల్లో వరి, వేరుశనగ, మొక్కజొన్న, మిర్చి, పత్తి పంటలు ధ్వంసమైనట్లు అంచనావేశారు. ప్రస్తుతం అధికారులు అంచనాల్లో నిమగ్నం కాగా.. ఒకటి, రెండు రోజుల్లో పంట నష్టంపై స్పష్టత రానుంది.
- వాజేడు మండలంలో ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్ ఆధ్వర్యంలో అధికారులు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ ప్రాంత ప్రజలను కాపాడేందుకు ఏటూరునాగారంలో పోలీస్ విపత్తు దళం ముళ్లకట్ట వద్ద హైపవర్ బోటులో రీహార్సల్ చేపట్టింది.

చనిపోయిన 13 వేల బాతులు... గుండెపోటుతో యజమాని మృతి



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టాపురానికి ఏపీలోని జగ్గయ్యపేట మండలానికి చెందిన పేరం ఆదిలక్ష్మి(67) కుటుంబ సభ్యులతో కలిసి బాతులను తీసుకొచ్చి పెంచుతున్నారు. తుపాన్ ప్రభావంతో తడిచిన 13వేల బాతు పిల్లలు మృతి చెందడంతో యజమాని ఆదిలక్ష్మి గుండెపోటుతో మృతి చెందారు.

పరిహారం ఇవ్వాలి: తెలంగాణ రైతు సంఘం

రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టాన్ని తక్షణం అంచనా వేసి నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు రూ. 20 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 40 వేలు చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి.సాగర్ కోరారు.

పంటలు తడిసి ముద్దయ్యాయి: కూనంనేని

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. పత్తి, మిర్చికి ఎకరాకు రూ. 40 వేలు, వరికి ఎకరాకు రూ.20 వేలు, కూరగాయలకు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు.


రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల పరిశీలకుడిగా ముకర్రం



పీఈటీ ముకర్రం

మహబూబ్‌నగర్ క్రీడలు: రంగారెడ్డి జిల్లా కొంపల్లిలో ఈనెల 9 నుంచి 11 వరకు జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ పరిశీలకుడిగా (బాలికల) సీనియర్ క్రీడాకారుడు, వనపర్తి పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ మీడియం పీఈటీ ఎండీ.ఫారుఖ్ ముకర్రం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ముకర్రం గతంలో పలుసార్లు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు పరిశీలకుడితోపాటు సివిల్ సర్వీసెస్ పోటీల్లో ఇప్పటివరకు పది సార్లు రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో విజేతగా నిలవాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాలలో నేటి నుంచి ఈనెల 10 వరకు జరిగే అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను బుధవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ మాట్లాడుతూ క్రీడల్లో నిరంతర సాధన చేస్తే మేటి క్రీడాకారులుగా ఎదగవచ్చని అన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి జియావుద్దీన్, పీఈటీలు శంకర్‌నాయక్, బాల్‌రాజు, ఆసిఫ్, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. బుధవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 1,645 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఆవిరి రూపంలో 67, ఎడమ కాల్వకు 390, కుడి కాల్వకు 338, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్టు-2కు 851 క్యూసెక్కులతో కలిపి మొత్తం 1,645 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం ప్రాజెక్టులో 8.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పోటెత్తిన వేరుశనగ



విక్రయానికి మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ ధాన్యం

- అత్యధికంగా క్వింటా రూ.8,199
- కళకళలాడుతున్న వనపర్తి వ్యవసాయ మార్కెట్‌యార్డ్

వనపర్తి: ఎప్పటిలాగే వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో ముందస్తు యాసంగి వేరుశనగ కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. 15 రోజుల కిందట ప్రారంభమైన కొనుగోళ్లు తాజాగా పుంజుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం రోజుకు నాలుగు వేల నుంచి పది వేల బస్తాల వరకు విక్రయానికి వస్తున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సీజన్ ప్రారంభ దశలో ఉండటం.. ధరలు అధికంగా పలుకుతుండటంతో రైతులు జాప్యం చేయకుండా విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. వనపర్తితో పాటు కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల నుంచి ఇక్కడి మార్కెట్‌కు విక్రయానికి వస్తోంది.

30 వేల బస్తాలకుపైగా..

జిల్లాలో ముందస్తు యాసంగిలో 4,160 ఎకరాలు, యాసంగి సీజన్‌లో 18,518 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం ముందస్తు యాసంగి పంట విక్రయానికి వస్తోంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు దాదాపుగా 30 వేల బస్తాలు విక్రయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

ఈ సీజన్‌లో అత్యధిక ధర..

వనపర్తి మార్కెట్‌యార్డులో బుధవారం నాణ్యమైన వేరుశనగ క్వింటా రూ.8,199, అత్యల్పంగా రూ.4,219, సాధారణ ధర రూ.7,281 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి లక్ష్మయ్యగౌడ్ తెలిపారు.

కొనుగోళ్లలో వేగం పెరిగింది..



మార్కెట్‌లో వారం రోజులుగా వేరుశనగ కొనుగోళ్లు పుంజుకున్నాయి. రైతులు ఆశించిన మేర ధరలు లభిస్తున్నాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నాం. గేట్ ఎంట్రీలు పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. రైతుల సెల్‌నంబర్లతో ఎంట్రీలు చేసేలా చూస్తాం.

– రమేష్‌గౌడ్, చైర్మన్, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ

పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో టెండర్ ప్రక్రియ కొనసాగిందని వివరించారు.

ఎలాంటి వివరాలు లేకుండానే అనుమతులు..

మార్కెట్ నిబంధనల ప్రకారం ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతు సెల్‌నెంబర్.. ఎన్ని బస్తాల ధాన్యం తీసుకొచ్చారు.. ఏ వాహనంలో తీసుకొచ్చారు.. తదితర వివరాలను మార్కెట్‌లోకి వచ్చే ముందే నమోదు చేయాల్సి ఉంది. కాని బుధవారం అవేవీ లేకుండానే గేట్‌లోకి అనుమతించడం గమనార్హం. కమీషన్ ఏజెంట్లు మార్కెట్ కార్యాలయంలో రైతుల పేర్లతో గేట్ ఎంట్రీలు నమోదు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. అమ్మకానికి తీసుకొచ్చిన ధాన్యానికి ఎంత ధర నిర్ణయించారనే విషయాన్ని సెల్‌నంబర్‌కు మెస్సేజ్ రూపంలో రైతులకు పంపించాల్సి ఉండగా.. అవేవీ జరగడం లేదు.

కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడలు



హైదరాబాద్, మెదక్ జట్ల మధ్య పోటీ

గద్వాల అర్బన్: పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ 67వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర క్రికెట్ పోటీలు రెండోరోజు బుధవారం హోరాహోరీగా సాగాయి. హైదరాబాద్, మెదక్ జట్లు తలబడగా హైదరాబాద్ విజయం సాధించింది. అదే విధంగా నల్గొండపై రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌పై ఖమ్మం, వరంగల్‌పై ఆదిలాబాద్, హైదరాబాద్‌పై ఆదిలాబాద్ జట్టు విజయం సాధించాయి. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, డీవైఎస్ఓ బీఎస్ ఆనంద్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య పాల్గొన్నారు.

23న శ్రీమద్భవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు



కంఠస్థ పోటీల కరపత్రాలను విడుదల చేస్తున్న సంస్కృత భారతి సభ్యులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గీతా జయంతిని పురస్కరించుకుని ఈనెల 23న స్థానిక వెంకటేశ్వరకాలనీలోని శ్రీరామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో శ్రీమద్భవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్టు సంస్కృత భారతి పాలమూరు జిల్లా అధ్యక్షుడు జ్యోషి ఆనందాచార్యులు, కార్యదర్శి మలిశెట్టి నాగరాజు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమితి కార్యాలయంలో ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం పది గంటలకు నాలుగు స్థాయిలలో ఈ పోటీలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా శిశుస్థాయికి ఎల్‌కేజీ నుంచి రెండో తరగతి వరకు చదివే విద్యార్థులు అర్హులన్నారు. వీరు ఒకటి నుంచి ఐదో శ్లోకం కంఠస్థం చేయాల్సి ఉంటుందన్నారు. ప్రాథమిక స్థాయికి సంబంధించి మూడు నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులు అర్హులన్నారు. వారు ఒకటి నుంచి పదో శ్లోకం కంఠస్థం చేయాల్సి ఉంటుందన్నారు. మాధ్యమిక స్థాయికి గాను ఆరు, ఏడు తరగతుల వారు ఒకటి నుంచి 15వ శ్లోకం వరకు కంఠస్థం చేయాల్సి ఉంటుందన్నారు. ఇక ఉన్నతస్థాయికి సంబంధించి ఎనిమిది నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు అర్హులన్నారు. వీరు ఒకటి నుంచి 20వ శ్లోకం వరకు కంఠస్థం చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం గెలుపొందిన వారికి మొదటి, రెండు, మూడో బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రం ఇస్తామన్నారు.

కిటకిటలాడిన కురుమూర్తిగిరులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



జాతర మైదానంలో కొనుగోలుదారుల రద్దీ

చిన్నచింతకుంట: కురుమూర్తి ఉత్సవాలకు బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాల్లో రద్దీ కనిపించింది. భక్తులు కోనేటిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో బారులుతీరారు. పలువురు భక్తులు మెట్లపై దీపాలు వెలిగిస్తూ, కొబ్బరికాయలు కొడుతూ గోవింద నామస్మరణలతో స్వామివారిని దర్శించుకున్నారు. మరికొందరు కొండ దిగువన మట్టికుండలో దాసంగాలు పెట్టి, గండదీపాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన ఉన్న అలువేలు మంగ, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, ఉద్దాల మండపం వద్ద రద్దీ కనిపించింది. జాతర మైదానంలోని ఆట వస్తువులు, గాజుల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. రంగుల రాట్నాల వద్ద జనం రద్దీ కనిపించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కురుమూర్తి కోడేల వేలం..

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పలువురు భక్తులు స్వామివారికి సమర్పించిన కోడెదూడలకు బుధవారం ఆలయ అధికారులు వేలం నిర్వహించారు. ఈ వేలంతో ఆలయానికి రూ.1.79 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శివానందాచారి, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

'రేవంత్' సల్లంగా ఉండాలి

- కొండారెడ్డిపల్లిలో మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న కుటుంబ సభ్యులు

వంగూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న మా గ్రామ బిడ్డ రేవంత్ పది కాలాల పాటు సల్లంగా ఉండాలని కొండారెడ్డిపల్లి మహిళలు దీవించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా బుధవారం గ్రామంలోని మహిళలందరికీ ఆయన కుటుంబసభ్యులు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మా ఊరి పేరును దేశవ్యాప్తంగా వినిపించేలా చేసిన మా రేవంత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మంచిపేరు తెచ్చుకోవాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేమారెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.